క్లుప్తంగా

దర్యాప్తునకు మూడు బృందాలు

గార/శ్రీకాకుళం క్రైమ్: కె.మత్స్యలేశంలో ఆదివారం రాత్రి మూడు ఇళ్లల్లో జరిగిన బంగారం దొంగతనం కేసుకు సంబంధించి మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్.వివేకానంద మంగళవారం తెలిపారు. శ్రీకాకుళం పట్టణ సీఐ కె.పైడపునాయుడు ఆధ్వర్యంలో బృందం, సాంకేతిక బృందం, గుర్తింపు బృందం దర్యాప్తు చేశాయని చెప్పారు. డీఎస్పీ పర్యవేక్షణలో సీఐతో పాటు గార ఎస్ఐ సీహెచ్.గంగరాజు, శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ, సీసీఎస్ఎ పోలీసులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే ముద్దాయిలపై కొంత సమాచారం సేకరించామని, ఇద్దరు నిందితులు పాల్గొనట్లు గుర్తించామని, ఇళ్ల గురించి తెలిసిన వ్యక్తులే దొంగతనానికి పాల్పడినట్టు అంచనాకు వచ్చినట్టు తెలిపారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



ధ్రువపత్రాలతో అభ్యర్థులు

శ్రీకాకుళం కల్చరల్ : ప్రతిఒక్కరూ ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు అన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రథమ చికిత్సపై యువతకు శిక్షణ ఇచ్చారు. అనంతరం అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, వైస్ చైర్మన్ డాక్టర్ పి.సుధీర్, కె.సత్యనారాయణ, జి.రమణ, చైతన్య, బి.చిన్మయరావు, ఏ.నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

చెవిటిపోలమ్మా.. చల్లగా చూడమ్మా..



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

జి.సిగడాం : పెంట గ్రామంలో మంగళవార చెవిటి పోలమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏటా ఖరీఫ్ సీజన్ అనంతరం ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో గ్రామస్తులంతా అమ్మవారిని ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న సత్సంగం



సత్సంగం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు నిర్వహణలో మంగళవారం సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత శక్తులపై విజయం సాధించడమే దుర్గాపూజలోని అంతర్యమని చెప్పారు. అనంతరం చౌదరి శ్రీనివాస్, గేదెల ఉమాదేవి, దార్లపూడి రవి బృందం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో శిల్లా రమేష్, బి.వి.రవిశంకర్, వరదా వెంకట ఆనంద్, నంబాళ్ల కల్పన, దేసూళ సురేంద్ర, పూడి శ్రీనివాసరెడ్డి, కాత్యాయని, సురంగి మోహనరావు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ నిఘాతో అక్రమాలకు అడ్డుకట్ట



నగరంలో డ్రోన్ కెమెరాతో నిఘా

శ్రీకాకుళం క్రైమ్: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే దిశగా శ్రీకాకుళం నగరంలో నిర్మానుష్యమైన ప్రదేశాలలో నిరంతరం డ్రోన్ నిఘా కొనసాగుతుందని ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీకాకుళం పట్టణ ఒకటి, రెండో పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్మానుష్యమైన ప్రదేశాలు, పాడుబడిన బంగ్లాలు, తోటల వద్ద పరిసర ప్రాంతాలను డ్రోన్ కెమెరాలతో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

4, 5 తేదీల్లో సీఐటీయూ మహాసభలు

ఇచ్ఛాపురం: సోంపేటలో ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ లైబ్రరీ ఆవరణలో మండలస్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తు చేపడుతున్న ఉద్యమాలను ఉద్ధృతం చేయాలన్నారు. సీఐటీయూ ప్రతినిధులు రమేష్‌పట్నాయక్, రంగాల శ్రీనివాసరావు, హైమావతి పాల్గొన్నారు.

శాకాహారం.. పోషకాలు పుష్కలం

- ఆహారం, హిందూ సంప్రదాయంలో కీలకపాత్ర
- శాకాహారంపై ప్రచారం చేస్తున్న పిరమిడ్ సంస్థ
- నేడు శాకాహార దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్:

ఆరోగ్యం మహాభాగ్యం అంటారు పెద్దలు. ఆరోగ్యం విషయంలో ఆహారం కీలకపాత్ర పోషిస్తుంది. ఇందులో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో కూలిన శాకాహారం ముఖ్యమైనది. గత కొన్నేళ్లుగా శ్రీకాకుళం పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ప్రతినిధులు శాకాహారం ఆవశ్యకతపై ప్రచారం చేస్తున్నారు. హిందూ సంప్రదాయంలోనూ శాకాహారానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆషాఢమాసం, ఆశ్వయుజ మాసంలో అమ్మవార్లకు కూరగాయలతో అలంకరించి శాకంబరీదేవిగా కీర్తిస్తారు. ఏటా అక్టోబర్ 1న శాకాహార దినోత్సవంగా జరుపుకుంటారు.



పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో శాకాహార ర్యాలీ (ఫైల్)

ఎన్నో పోషకాలు..

ఆకుకూరల వల్ల శరీరానికి అతి ముఖ్యమైన ఐరన్ లభిస్తుంది. పండ్లు, కూరగాయాల్లో పీచు పదార్థం వంటి సెల్యులోజ్ పేగులను శుభ్రపరిచి వ్యాకోచింపచేసి వాటిలోని చెమ్మను రక్షిస్తుంది. వాటిలోని సహ ఆమ్లం అన్నాశయంలో జీర్ణశక్తికి తోడ్పడుతుంది. శాకాహారం మనస్సు స్థితి, పర్యావరణ సమతుల్యత, సమాజ శ్రేయస్సు, ఆధ్యాత్మిక ఆలోచనలన్నింటినీ ప్రభావితం చేస్తుంది. ప్రధానంగా పండ్లు, ఆకుకూరలు, ధాన్యాలు, కాయధాన్యాలు, గింజల్లో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలను సమృద్ధిగా అందిస్తాయి. అధిక ఫైబర్, తక్కువ కేలరీలు కారణంగా బరువు నియంత్రణ సులభమవుతుంది. ఆధ్యాత్మిక చింతన, మానసిక స్థితి స్థిరంగా ఉంటుంది.



శారదాపీఠంలో అమ్మవారికి కూరగాయలతో అలంకరణ

అమ్మవారికి ప్రీతికరం



కూరగాయలతో అలంకరణ చేయడం అమ్మవారికి ఎంతో ప్రీతికరం. ఆషాఢమాసం, భాద్రపద మాసాలలో అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరిస్తుంటాం.

– మోదుకూరి కిరణ్‌శర్మ, అర్చకులు

ఆరోగ్యకరం..



దీర్ఘకాల ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి శాకాహారం ఉత్తమ మార్గం. శాకాహారం వల్ల మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్లు, గుండెజబ్బులు తక్కువగా గురవుతారు.

– డాక్టర్ లక్ష్మీకాంత్, శ్రీకాకుళం

శాకాహారంపై ప్రచారం



శాకాహారంపై కొన్నేళ్లుగా ప్రచారం చేస్తున్నాం. ఎంతో మందిలో మార్పు తెచ్చాం. ఏటా రెండు సార్లు నగరంలో శాకాహారంపై ర్యాలీలు నిర్వహిస్తున్నాం.

– కోపూరి బిందుమాధవి, పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ, శ్రీకాకుళం

సెపక్‌తక్ర క్రీడాకారులకు సన్మానం

శ్రీకాకుళం న్యూకాలనీ: సెపక్‌తక్ర క్రీడాకారులు జిల్లాకు గర్వకారణంగా నిలుస్తారని సెపక్‌తక్ర అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు వేదికగా ఈ నెల 27, 28 తేదీల్లో జరిగిన 35వ ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్స్ సెపక్‌తక్ర చాంపియన్‌షిప్–2025 పోటీల్లో శ్రీకాకుళం మహిళల జట్టు విజేతగా నిలిచింది. గత సీజన్‌తోపాటు ఈ సీజన్‌లోనూ విజేతలుగా నిలిచి బంగారు పతకాలు సాధించారు. టోర్నీ ముగించుకుని జిల్లాకు చేరుకున్న మహిళల జట్టును మంగళవారం శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వేదికగా ఘనంగా సన్మానించారు. జిల్లా సంఘం చైర్మన్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోచ్ గాలి అర్జున్‌రావురెడ్డి మాట్లాడుతూ 11 ఏళ్లగా 40 మందికిపైగా క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహించడమేకాకుండా అనేకమంది పతకాలు సాధించారని, పలువురు ఉద్యోగ అవకాశాలను అందుపుచ్చుకున్నారని చెప్పారు. అనంతరం కోచ్‌తో పాటు క్రీడాకారిణిలను, మేనేజర్ బగ్గు రామకృష్ణ, తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు పైడి శ్రీనివాసరావు, కోశాధికారి రాజు, కొర్లయ్య, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సత్కారాలు అందుకున్న ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన వృద్ధుడు

శ్రీకాకుళం రూరల్: పెదపాడు పరిసర ప్రాంతంలో ఎస్‌వీడీ హోటల్ వద్ద భిక్షాటన చేసిన వ్యక్తి సెప్టెంబర్ 17న ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. వివరాలు తెలిస్తే శ్రీకాకుళం రూరల్ పోలీసులు(6309990814)ను సంప్రదించాలని కోరారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

ఎచ్చెర్ల : అల్లినగరంలో అమిజోటు శంకరరావు అనే వ్యక్తి మంగళవారం 21 మద్యం బాటిళ్లను కోనేరు వద్ద అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

ఘనంగా అమ్మవారి పండగ

ఎచ్చెర్ల : అల్లినగరం పంచాయతీలో మంగళవారం అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఉల్లిపాయల లారీ బోల్తా

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండిగేటు–పెద్దబాణాపురం మధ్య మంగళవారం వేకువజామున ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి కోల్‌కత్తా వెళ్తున్న లారీ బాణాపసురం దాటాక అదుపుతప్పి చెరువులో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ సబల్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్‌ను పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిచారు. అనంతరం ప్రత్యేక క్రేన్ తెప్పించి లారీని చెరువు నుంచి బయటకు తీశారు. డ్రైవర్ సబల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నందిగాం ఎస్ఐ మహ్మద్ ఆలీ తెలిపారు.



క్రేన్‌తో చెరువులోనుంచి లారీని బయటకు తీస్తున్న దృశ్యం

సరిగమ పదనిస రాగం..!

- సంగీతంపై ఆసక్తి పెంచుకుంటున్న నగరవాసులు
- అండగా నిలుస్తున్న శిక్షణాలయాలు
- ప్రోత్సాహం అందిస్తున్న గురువులు
- నేడు ప్రపంచ సంగీత దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్ : మనసుకు సాంత్వన చేకూర్చే సంగీతంపై నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. శాస్త్రీయ సంగీతం, ఇతర వాయిద్య పరికరాల్లో శిక్షణ పొందేందుకు మక్కువ కనబరుస్తున్నారు. ఆనంద రస ప్రధానమైన సంగీతంలో మూడు ప్రధాన అంశాలు ఉంటాయి. పాట, సంగీత వాయిద్యాలు, నాట్యం. ప్రస్తుతం సనాతన సంగీతం అనేక రూపాలుగా విస్తరించింది. శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం, గజల్స్, భజనలు, జానపద గేయాలు తదితర రూపాల్లో అలరిస్తోంది. శాస్త్రీయ సంగీతంలో హిందూస్తానీ, కర్నాటక సంగీతం ఉన్నాయి. హిందూస్తానీ సంగీతం ఉత్తర, తూర్పు పశ్చిమ భారతదేశంలో అభివృద్ధి చెందగా కర్నాటక సంగీతం దక్షిణ భారతదేశంలో ప్రాచుర్యం పొందింది.



సంగీత నిలయంలో సాధన చేస్తున్న అభ్యాసకులు

పెరుగుతున్న మోజు..

జిల్లాలో శాస్త్రీయ సంగీతంపై మోజు పెరుగుతోంది. వేదికలతో పాటు టీవీ ఇతర మాధ్యమాల్లో జరిగే పాటల పోటీల్లో పాల్గొనేందుకు నేటి యువత ఉత్సాహం చూపుతున్నారు. వీరిని తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తూ పిల్లలకు సంగీతం నేర్పిస్తున్నారు. సంగీతం నేర్చుకోవడం వల్ల ఏకాగ్రత, క్రమశిక్షణ పెరుగుతాయి. మనసు ఉల్లాసంగా మారి చేస్తున్న పనిపై ధ్యాస పెరుగుతుంది.

నేర్చుకోవాలంటే..

సంగీతం నేర్చుకుందామనే ఉత్సాహం చూపుతున్న యువతకు నేర్పేందుకు ఎంతో మంది గురువులు సిద్ధంగా ఉన్నారు. మన ప్రాంతంలో ఒక్క విజయనగరంలో మాత్రమే సంగీత విద్యాలయం ఉండడంతో అక్కడికి వెళ్లే అవకాశాలు లేక మిన్నకుండే వాళ్ల కోసం కొందరు గురువులు ఫీజు లేకుండా, మరికొందరు అతి తక్కువ ఫీజులతో శిక్షణ ఇస్తున్నారు. సంగీతంలో డిప్లమా చేయాలంటే ఆరేళ్ల కోర్సు పూర్తి చేయాలి. ముందుగా సర్టిఫికెట్ కోర్సు నాలుగేళ్లు చేయాలి. మరో రెండేళ్లు డిప్లమా కోసం కేటాయించాలి. సరళీశ్వర, జంటస్వరాలు, అలంకారాలు, గీతాలు, స్వరపల్లవులు, స్వరజతులు, వర్ణాలు, కృతులు, కీర్తనలు ప్రాథమి స్థాయిలో వస్తే సర్టిఫికెటు కోర్సు లభిస్తుంది. డిప్లమా కోసం వీటితో పాటు రాగం, తానం, పల్లవులు, మనోధర్మ సంగీతంపై పూర్తి అవగాహన ఉండాలి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏటా నిర్వహించే పరీక్షల కోసం ఇక్కడ సిద్ధం చేస్తుంటారు.

శిక్షణ ఇస్తున్నాం..



నా వద్దకు ఎంతో మంది చిన్నారులు సంగీతం నేర్చుకునేందుకు వస్తుంటారు. వారికి మంచి శిక్షణ ఇచ్చి కళాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ క్రమంలో సర్టిఫికెట్, డిప్లమో కోర్సులకు సైతం సిద్ధం చేస్తున్నాం.

– సుసరాపు లక్ష్మీగణపతి శర్మ, రాజరాజేశ్వరీ సంగీత విద్యాలయం, కత్తెరవీధి

పెద్దలు సైతం..



చిన్నారులతో పాటుగా సీనియర్స్ కూడా సంగీతం నేర్చుకునేందుకు వస్తున్నారు. గాత్రంతోపాటు వయొలిన్ కూడా నేర్పుతున్నాం. చిన్నతనంలో శ్రద్ధ ఉండి నేర్చుకోలేని ఎంతో మంది ఇప్పుడు నేర్చుకునేందుకు వస్తున్నారు.

– దుంపల ఈశ్వరరావు, వాణి సంగీత విద్యానిలయం, ఇలిసిపురం

ఉచిత బోధన..



సంగీతాన్ని పది మందికి పంచడమే మా ఉద్దేశం. కొంత మందికి ఉచితంగా చెబుతున్నాం. వేసవిలో ఉచితంగా బోధన చేస్తున్నాం. అనురాగ నిలయంలో చిన్నారులకు ఏడాదిపాటు ఉచితంగా నేర్పాను.

– రెడ్డి సత్యనారాయణ, శృతిలయ సంగీత శిక్షణాలయం, దండివీధి

పరాశక్తి లలిత.. శివానంద చరిత



శ్రీకాకుళం రూరల్: బైరివానిపేటలో కుంకుమ పూజలు



శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలో దుర్గాదేవిగా లలితాదేవి



శ్రీకాకుళం కల్చరల్: నానుబాలవీధిలో దుర్గాదేవిగా విజయదుర్గ



శ్రీకాకుళం కల్చరల్: బలగలో దుర్గామాతగా బాలాత్రిపుర సుందరి



శ్రీకాకుళం కల్చరల్: నిమ్మకాయల అలంకరణలో ఉమాదేవి



రణస్థలం: గొల్లపేట దుర్గాదేవి పూజలో వైఎస్సార్‌సీపీ నేత పిన్నింటి సాయికుమార్



శ్రీకాకుళం కల్చరల్: బలగ కాలభైరవ పీఠంలో సామూహిక కుంకుమ పూజలు



తమ్మినాయుడుపేట అసిరితల్లి ఆలయం వద్ద ధర్మాన ప్రసాదరావుకు సత్కారం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు, దేవీ మండపాల్లో దుర్గాదేవికి విశేష పూజలు జరిగాయి. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: ప్రత్యేక అలంకరణలో నీలమ్మతల్లి

చట్టాలపై అవగాహన అవసరం

శ్రీకాకుళం కల్చరల్: రాజ్యాంగపరంగా చట్టాలు అందరికీ ఒకేలా వర్తిస్తాయని, మతస్వేచ్ఛకు సంబంధించి ముఖ్యమైన అధికరణలు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఉమన్స్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి కె.వి.రమణ, న్యాయవాది ఎ.ప్రభాకరరెడ్డి అన్నారు. శ్రీకాకుళం చిన్నబజారులోని తెలుగు బాప్టిస్టు చర్చిలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బులేదన్న కారణంగా న్యాయం జరగదన్న ఆలోచనలో ఉన్న బాధితులకు 90 రోజు ల్లో సమస్య పరిష్కరించే దిశగా న్యాయస్థానం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ డి.ఎస్.వి.ఎస్.కుమార్ మాట్లాడుతూ విబేధాలు లేకుండా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌బీఎల్ కుమార్, కె.డానియల్, ఒంపూరు రమేష్, శామ్యూల్ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధికారి కె.వి.రమణ